

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## రెండు కారణాలు.

**"నేను అలిగాను"** యామిని పొడవైన జడని వెనక్కి వేసుకుంటూ చెప్పింది.

"ఎందుకుటా?" రమణ నవ్వుతూ అడిగాడు.

"మీకోసం అరగంట కష్టపడి ముస్తాబైతే మీరు గుర్తించలేదు" ఉక్రోషంగా చెప్పింది.

రమణ గలగల నవ్వాడు.

"నువ్వెప్పుడూ నాకు ముద్దొస్తూనే ఉంటావ్ బంగారం. ముస్తాబులు అంటూ ప్రత్యేకంగా చేయక్కర్లేదు. అసలు ముస్తాబు అన్న మాట విని ఎన్ని రోజులైందో."

"రెడీ అంటే అంత ఇంపాక్ట్ ఉండదని" యామిని కూడా నవ్వింది.

"మధ్యాహ్నం మామగారు ఫోన్ చేసారు."

యామిని మొహంలోని నవ్వు ఎగిరిపోయింది. మౌనంగా నిలబడింది.

"పురుటికి పుట్టింటికి రమ్మంటే రానని మొండికేస్తోంది. పోనీ వాళ్ళ పిన్నిని పంపుతానంటే ససేమిరా అంటోంది. మీరైనా నచ్చ చెప్పండి" అన్నారు.

యామిని భారంగా నడుస్తూ వచ్చి భర్త పక్కన కూర్చుంది.

"నేను మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నానా? పూర్వకాలంలో ఏమో కానీ ఇప్పుడు డెలివరీ అంటే చాలా చిన్న విషయం. మా పనిమనిషి డెలివరీ అయిన పదిరోజులకే పనికి వచ్చేది పాపం. పాటక జనం అంతా అంతే. శ్రమ జీవులు.

నేను ఆరోగ్యంగా ఉన్నాను. హాస్పటల్‌కి వెళ్ళేదాకా పని పాటలు చేయగలను. డెలివరీ అయ్యాక బేబీతో కొంచెం కష్టం. మనకి అలవాటు లేదు కాబట్టి. హాస్పిటల్ వాళ్ళని అడిగి ఎవరైనా ఆయాని పెట్టుకుందాం. సరేనా?" జాలిగా అడిగింది.

"సరే అని చాలాసార్లు చెప్పాను బంగారం. కానీ ఇంట్లో ఒక ఆడదిక్కు ఉండాలిరా అంటుంది అమ్మకూడా. ఆవిడ వచ్చినా పని చేయలేదు. మీ నాన్న మీ పిన్నిని పంపుతానంటే ఎందుకు వద్దంటున్నావ్? ఆవిడ మీద నీకెందుకంత కోపం" రమణ మృదువుగా అడిగాడు.

"ఆవిడ మీద నాకు కోపమని చెప్పానా?"

"మీ నాన్న చెప్పారు. నువ్వు, మీ తమ్ముడు ఆవిడతో ఒక్క మాటకూడా మాట్లాడరట కదా?"

"ఆయనతో కూడా మాట్లాడం. అది చెప్పలేదా ఆయన?" క్రోధంగా అడిగింది.

"శాంతం, శాంతం. ఇలాగే కోపంతో ఊగిపోతే మనకి దుర్వాసుడో, విశ్వామిత్రుడో పుడతాడు నీ ఇష్టం" రమణ వాతావరణాన్ని తేలిక చేయడానికి చెప్పాడు.

ఆ రాత్రి చిన్న దీపం కూడా లేని చీకటిగదిలో తలకింద చేతులు ఉంచుకుని వెల్లకిలా పడుకున్న యామిని తన ఎత్తయిన పొట్టని తడిమే రమణ చేతిని గట్టిగా పట్టుకుంది.

ఆ స్పర్శలోని కంపనని గుర్తించిన రమణ మృదువుగా చెప్పాడు.

"భయపడకు బంగారం. మనం మేనేజ్ చేద్దాం. ఓపిక ఉన్నంతవరకు చేసుకుందాం. పదిరోజుల ముందే హాస్పిటల్‌లో జాయిన్ అయితే కంగారు ఉండదు."

"మా నాన్న సాధువులు, సన్యాసులు అని తిరుగుతూంటే నాయనమ్మ ఏడ్చి, బతిమాలి పెళ్ళి చేసింది. మా అమ్మ పోయేనాటికి నాకు పద్దెనిమిది, తమ్ముడికి పధ్నాలుగు, నాన్నకి అరవైరెండేళ్ళు. అమ్మపోయిన ఆరునెలలకి ఆయన 'రెండురోజులు ఊరు వెళ్ళొస్తా జాగ్రత్తగా ఉండండి' అని చెప్పి వెళ్ళి పాతికేళ్ళ అమ్మాయితో వచ్చాడు. 'మీ పిన్ని' అని చెప్పాడు.

"అమ్మ పోయి ఆర్నెల్లు కాలేదు. నీకు అప్పుడే పెళ్ళి కావాల్సి వచ్చిందా?" తమ్ముడు అరిచాడు.

"మరేం చేయమంటావోయ్. ఆయుర్దాయం లేనిది అది పోవడమేకాదు. దాంతోపాటు నా అనుష్టానాన్ని కూడా తీసుకుపోయింది. పెళ్ళాం పక్కన లేకుండా నేను పూజలు, హోమాలు ఎలా చేయాలి? అందుకే పెళ్ళి చేసుకున్నా" నాన్న అంతకంటే పెద్దగా అరిచి సమర్ధించుకున్నారు.

"మరీ ఇంత చిన్నమ్మాయిని కాకుండా భర్తపోయిన ఏభై ఏళ్ళావిడనో, పిల్లల తల్లినో చేసుకోవచ్చు. పోనీ డివోర్స్ తీసుకున్న పెద్దావిడని?" తమ్ముడు కోపంగా అడిగాడు.

"నాకెందుకోయ్ ఆ తద్దినం? నాకేం ఖర్మ?" అరవైరెండేళ్ళాయన నిస్సిగ్గుగా చెప్తూంటే నేను తమ్ముడిని మాట్లాడద్దని వారించాను.

తెల్ల నూలుచీరలోని ఆ అమ్మాయి మావంక భయంగా చూస్తోంది. నాకు జాలేసింది. ఆయన ఆమెకి ఇల్లు చూపించి, అమ్మ చీరలు కట్టుకోమని చెప్పాడు. ఆ అమ్మాయి ఉత్త చేతులతో వచ్చింది.

"తర్వాత ఆయన బయటకి వెళ్ళినప్పుడు ఆమెతో మాట్లాడాం. చిన్నప్పుడు చదివిన బెంగాలీ, బీహార్, ఒరిస్సాలలోని కరువు, పేదరికం మన రాష్ట్రంలో కూడా ఇంకా ఉందని నాకు ఆమెతో మాట్లాడాక అర్ధమైంది. తినడానికి తిండికూడా లేని కుటుంబం. మా నాన్న తన పెన్షన్ ఆశ చూపించాడు. తను పోతే దాదాపు నెలకి ఏభైవేలు వస్తుందని. పులి, బంగారు కంకణం కథ గుర్తుందిగా? కడుపు నింపుకోడానికి తడుముకోనక్కర్లేదు. ఆయన తర్వాత ఆయన ఫేమిలీ పెన్షన్ వస్తుంది అని దాదాపు నాన్న వయసే ఉన్న వాళ్ళ నాన్న కూతురుకి నచ్చెప్పి ఈ పెళ్ళి చేసాడట. ఇంకా ఘోరం ఏమిటంటే, పెళ్ళి తర్వాత వాళ్ళ వాళ్ళెవరూ మా ఇంటికి రాకూడదని, తను ఆ అమ్మాయిని పుట్టింటికి పంపనని చెప్పాడట" బహుశా ఈ దరిద్రపు సంతంతా తనమీద పడుతుంది అనుకుని ఉంటాడు.

"మేము ఆ అమ్మాయితో బానే ఉంటాం. కానీ ఆయన ఇంట్లో ఉన్నప్పుడు మాట్లాడం. ఎందుకంటే, మా నిరసన మా నాన్నకి తెలియాలి కదా?" పెళ్ళి తర్వాత ఆ ఇంట్లో కాలు పెట్టకూడదని ముందే నిర్ణయించుకున్నా."

"మరి ఆవిడ వచ్చి మనతో ఉంటే ఏమిటి ఇబ్బంది? ఆవిడతో మీ నాన్న కూడా వస్తారనా?" రమణ అడిగాడు.

"కాదు. రెండు కారణాలు. ఒకటి మీరు."

"నేనా?" రమణ ఆశ్చర్యపోయాడు.

"అవును. నేను పక్కనుంటే మీ చేతులు ఊరుకోవు. సరసంగా ఏదో మాట అంటునే ఉంటారు. తనకి ఇవన్నీ తెలీవని కాదుకాని ప్రత్యక్షంగా చూడడం నాకు ఇష్టంలేదు. రెండు నా డెలివరీ. మనకి పుట్టబోయే బుజ్జిపాప. మా పిన్నికి లేని ఈ రెండు అదృష్టాలు ఆమె ముందు నేను అనుభవించడం నాకు గిల్టీగా ఉంటుంది."

"మన బిడ్డ ఎంత మంచి తల్లి పెంపకంలో పెరగబోతోందో తలచుకుంటే నాకెంతో గర్వంగా ఉంది" రమణ భార్య చేతిని నిమురుతూ చెప్పాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments